# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 113 సోమవారం | 30 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


## నేను మీ మనిషిని

మన మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారు

కేసీఆర్‌తోనే మనకు భవిష్యత్తు

ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



8లో..

# హస్తంలో.. అలకలు



- కొనసాగుతున్న అసమ్మతి సెగలు
- భవిష్యత్ కార్యాచరణపై క్యాడర్‌తో సమీక్ష
- బుజ్జగింపుల పర్వానికి శ్రీకారం
- ససేమిరా అంటున్న సీనియర్లు
- ఎటూ తేలని డోర్నకల్ సీటు

వివరాలు 2లో..

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కల్లోలం కొనసాగుతూనే ఉంది. పార్టీ టికెట్ ఆశించినా ఫలితం దక్కకపోవడంతో పార్టీ సీనియర్ లీడర్లు నారాజ్ అయ్యారు. ఇంతకాలం పార్టీకోసం పనిచేస్తే ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు. కొందరు క్యాడర్ సపోర్ట్‌తో రెబల్స్‌గా బరిలోకి దిగేందుకు కసరత్తు ప్రారంభించగా మరి కొందరు పక్క పార్టీలవైపు చూస్తున్నారు. అయితే పార్టీ టికెట్ ఆశించి భంగపడిన లీడర్లను ఆకట్టుకునేలా అధికార బీఆర్ఎస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇప్పటికే జనగామ టికెట్ ఆశించిన మాజీ మంత్రి, 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరగా.. మరికొందరు అసంతృప్త నేతలు తమకు అనుకూలమైన పార్టీలోకి మారే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే అలకబూనిన నేతలను కాంగ్రెస్ పెద్దలు బుజ్జగించే పనిలో పడ్డారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. అప్పుడు అందరికీ పదవులు దక్కుతాయంటూ సముదాయిస్తున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి





## నిరుద్యోగులకు ఆశాజ్యోతి.. జీఎంఆర్ ట్రస్ట్..

'గుప్పెడు సంకల్పం' పేరుతో ఉచిత సేవా కార్యక్రమాలు

బీఆర్ఎస్ యువనేత, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గండ్ర గౌతంరెడ్డి పర్యవేక్షణలో నిరుపేదలకు బాసట

వివరాలు 6, 7 పేజీలలో..



2లో

## ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

వీడియో కాన్ఫరెన్స్‌లో సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్

పాల్గొన్న కలెక్టర్లు, ఎన్నికల అధికారులు



## బాణాసంచా విక్రయానికి దరఖాస్తు చేసుకోండి

తాత్కాలికంగా బాణాసంచా విక్రయాల అనుమతి కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాలలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు తప్పనిసరిగా అగ్నిమాపక విభాగం అధికారులు జారీ చేసిన ఎన్ ఓసి జత చేయాలన్నారు. ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లయితే స్థల యజమాని అనుమతి పత్రం, అలాగే ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతి పత్రం, పక్క నిర్మాణాల్లో ఏర్పాటు చేస్తున్నట్లయితే పక్కవారి అనుమతితో పాటు పక్క భవన బ్లూ ప్రింట్ తో పాటు స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా, ఆదాలట్ శాఖలో రూ.800 ప్రభుత్వ ఖజానాకు జామ చేసి బ్యాంక్ చాలన్ తో దరఖాస్తు చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 6వ తేదీలోగా సంబంధిత జోన్లకు చెందిన డీసీపీ స్థాయి అధికారులకు అందజేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు బాణాసంచా అనుమతులు జారీ చేస్తారన్నారు. - వరంగల్ వాయిస్, క్రైం

# హస్తంలో అలకలు



**కొనసాగుతున్న అసమ్మతి సెగలు**
**భవిష్యత్ కార్యాచరణపై క్యాడర్‌తో సమీక్ష**
**బుజ్జగింపుల పర్వానికి శ్రీకారం**
**ససేమిరా అంటున్న సీనియర్లు**
**ఎటూ తేలని డోర్నకల్ సీటు**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి వస్తున్న పాజిటివ్ వేవ్ తో ఆ పార్టీ టికెట్ దక్కించుకునేందుకు పోటీ తీవ్రమైంది. ఇంతకాలం పార్టీ కోసం పనిచేసిన సీనియర్ లీడర్లకే టికెట్ దక్కుతుందని ఆశపడిన వారు అధిష్ఠానం నిర్ణయంతో భంగపాటుకు గురయ్యారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హస్తం పార్టీలో అసమ్మతి సెగలు కక్కుతోంది. టికెట్లు దక్కని నేతలు అంతర్మథనంలో పడిపోయారు. అవసరమైతే రెబల్స్ గా బరిలోకి దిగి సత్తా చాటడమా లేక తమకు అనుకూలమైన పార్టీలోకి మారడమా అన్న ఆలోచనలో ఉన్నారు. ఈ మేరకు భవిష్యత్ కార్యాచరణపై క్యాడర్ తో ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. అధిష్ఠానంపై తిరుగుబాటు బాహుట ఎగురవేస్తున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ టికెట్ల కేటాయింపులో బీసీలకు, కేయూ ఉద్యమ కారులకు అన్యాయం చేశారంటూ విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. అగ్రవర్ణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ఆ పార్టీ రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తున్నారు.

## ఎటూ తేలని డోర్నకల్..



కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మొదటి జాబితాలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నలుగురికి టికెట్ అభించగా, రెండో జాబితాలో మరో ఏడుగురికి టికెట్ లభించింది. దీంతో మొత్తం 12 నియోజకవర్గాల్లో 11 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం డోర్నకల్ సీటుపై మాత్రం డెసిషన్ పెండింగ్ లో పెట్టింది. దీంతో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. అభ్యర్థిత్వానికి ప్రధానంగా ముగ్గురు నేతలు పోటీ పడుతున్నారు. రామచంద్రునాయక్, నెహ్రూనాయక్, భూపాల్ నాయక్‌ల మధ్య తీవ్ర పోరు కొనసాగుతోంది. అయితే సర్వే ఆధారంగా కీలక నేతల సహకారం, అసమ్మతి నేతల ప్రభావం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఇప్పటికే అభ్యర్థిని ఎంపిక చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. టికెట్ రేసులో ఉన్న నెహ్రూనాయక్ పేరును ఖరారు చేసినట్లు సమాచారం. అయితే అధికారిక ప్రకటన కోసం పార్టీ శ్రేణులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. అయితే ఈ ఉత్కంఠకు మరో రెండు, మూడు రోజుల్లో తెర పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## పశ్చిమలో..



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో టికెట్ ఆశించిన డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అధిష్టానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమలో తన వ్యక్తి గత ఇమేజ్ తోనే విజయం సాధించవచ్చన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని రూరల్ గ్రామాల్లో తనకు మంచి పట్టున్నట్లు చెప్పుకొస్తున్నారు. ఇప్పటికే తన అనుచరులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన ఆయన త్వరలో తన కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది. తనపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుట్ర చేశారంటూ జంగా రాఘవరెడ్డి బహిరంగంగా ఆరోపిస్తున్నారు. మొదటి నుంచి పార్టీ సమావేలకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా చివరకు నమ్మించి మోసం చేశారంటున్నారు.

## పరకాలలో..



పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపాతానికి 12 ఏండ్లుగా కష్టపడుతున్నా తనను కాదని కొత్త వ్యక్తికి పార్టి అధిష్టానం టికెట్ కేటాయించడంతో పరకాల నియోజకవర్గ ఇన్చార్జి ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి మదనపడుతున్నారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్న సమయంలో కార్యకర్తలకు అండగా ఉంటూ వారిలో భరోసా నింపడంతోనే నేడు పార్టీ మళ్లీ జీవం పోసుకుందని, ఇలాంటి సమయంలో పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా కొత్త వారికి టికెట్ కేటాయించడమేంటని ప్రశ్నిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం పార్టీలో చేరిన నర్సంపేట ప్రాంతానికి చెందిన రేవూరి ప్రకాష్ రెడ్డికి టికెట్ కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ క్యాడర్ మొత్తం పార్టీకి వ్యతిరేకంగా మారినట్లు పార్టీ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. అయితే తనకు 24 గంటల్లో టికెట్ కేటాయించకుంటే తనదారి తాను చూసుకుంటాననంటూ పార్టీ అధిష్టానానికి ఇనుగాల అల్టిమేటం జారి చేసినట్లు ప్రాచారం సాగుతోంది.

## వరంగల్ తూర్పులో..



వరంగల్ తూర్పు టికెట్ ను మాజీ మంత్రి కొండా సురేఖకు కేటాయించారు. అయితే ఈ టికెట్ కోసం పార్టీలో ఉన్న పలువురు సీనియర్ నేతలు కన్నేశారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తనకే తూర్పు టికెట్ కేటాయించాలంటూ చివరి వరకు ప్రయత్నించారు. అదే విధంగా పార్టీకోసం పనిచేస్తున్న తనకే టికెట్ కేటాయించాలంటూ మాజీ డిప్యూటీ మేయర్ యెంబాడి రవీందర్ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే ఇప్పటికే కొండా సురేఖ తూర్పు నియోజకవర్గంలో తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ఆరు పథకాలపై వివరిస్తున్నారు. అయితే పార్టీ టికెట్ కోసం ఎదురు చూసిన నేతలంతా నేడు ఆ పార్టీకి వ్యతిరేకంగానే పావులు కదుపుతున్నట్లు సమాచారం.

## పాలకుర్తిలో..



పాలకుర్తి టికెట్ కోసం మొదటి నుంచి ఇద్దరు ఎన్ఆర్ఐలు హనుమాండ్ల జాన్సీ, తిరుపతి రెడ్డి పోటీ పడ్డారు. ఇద్దరు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. ఒక దశలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రధాన పోటీ వీరినుంచే ఉంటుందని అందరూ భావించారు. అయితే జాన్సీ పౌరసత్వంపై కొంత అయోమయ పరిస్థితి నెలకొనడంతో ఆమె కోడలుగా చెప్పుకునే యువనేత మామిడిల యశస్వినికి అధిష్టానం టికెట్ కేటాయించింది. దీంతో టికెట్ ఆశించి భంగపడిన తిరుపతి రెడ్డి యశస్వినికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. దీంతో అక్కడినుంచి మంత్రి ఎర్రబెల్లి విజయం నల్లేరుమీద నడకే అన్నట్లుగా మారినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## వర్ధన్నపేటలో..



వర్ధన్నపేట నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీకి అసమ్మతి సెగలు తప్పడం లేదు. ఈ నియోజకవర్గంలో తనకే టికెట్ లభిస్తుందన్న ఆశతో హస్తం పార్టీకి చెందిన వర్ధన్నపేట నియోజకవర్గం ఇన్చార్జి నమిండ్ల శ్రీనివాస్ కాలికి బట్ట కట్టకుండా ప్రచారాన్ని నిర్వహించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నాంటూ అండగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో అప్పటినుంచి నమిండ్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా నిలిచారు. అయితే టికెట్ల కేటాయింపులో అధిష్టానం మొండి చేయి చూపడంతో ఆయన గత కొంత కాలంగా పార్టీకి దూరంగా గడుపుతున్నారు. తన క్యాడర్ కూడా అంటీ ముట్టనట్లు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

## బుజ్జగింపుల పర్వం..

ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు గాను 11 నియోజకవర్గాల్లో పార్టీ అబ్యర్థులకు ప్రకటించింది. ఒక్క డోర్నకల్ నియోజకవర్గంలో మాత్రం అభ్యర్థి ఎంపికలో అయోమయ పరిస్థితి నెలకొంది. అయితే మిగిలిన నియోజకవర్గాల్లో పార్టీ టికెట్ ఆశించి చివరకు టికెట్ దక్కకపోవడంతో నారాజైన పలువురు నేతలు పార్టీ కార్యక్రమాలకు, నాయకుల ప్రచారాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో అధిష్టానం బుజ్జగింపులకు శ్రీకారం చుట్టింది. రానున్నది కాంగ్రెస్ పాలనే అంటూ వారిలో భరోసా నింపుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పార్టీ సీనియర్ నేతలకు తగిన గుర్తింపు లభిస్తుందంటూ నచ్చజెబుతున్నారు. ఈ మేరకు పలువురు రంగ ప్రవేశం చేసి అలక వహించిన నేతలు తిరిగి పార్టీ ప్రచారంలో పాల్గొనేలా కృషి చేస్తున్నారు.

# ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ను సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ ఆదేశించారు. సోమవారం న్యూ ఢిల్లీ నుంచి ఆయన ఎన్నికల పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై నిర్వహించిన వీడియో సమావేశంలో హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి పాల్గొనగా, జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య , తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా మునిసిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, వర్ధన్నపేట రిటర్నింగ్ అధికారి జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అశ్విని తానాజీ వాకాడే, నర్సంపేట్ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి నర్సంపేట్ ఆర్డీవో కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలని, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నవంబర్ 3 నుంచి నామినేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థితో సహా ఐదుగురు సభ్యులు మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోనికి అనుమతి ఉంటుందని, నామినేషన్లు సమర్పించుటకు అభ్యర్థి వాహనంతో పాటు రెండు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, అభ్యర్థి కాన్వాయ్ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల మేరకు అనుమతి కలదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ నోడల్ అధికారి పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బాలకృష్ణ, ఎన్నికల ఖర్చుల నోడల్ అధికారి పుష్పలత, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సంజీవ రెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజ్ కుమార్, ఎన్నికల సూపరింటెండెంట్ విశ్వ నారాయణ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు చైతన్యంపై అవగాహన



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజక వర్గ పరిధిలోని టీఎల్ ఎఫ్ లకు సోమవారం మెప్మా ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ మెప్మా కార్యాలయంలో రిసోర్స్ పర్సన్స్ (ఆర్.పి.లు), ఓబీలకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ స్వీప్-2023 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ టీపీఆర్ ఓ, నియోజక వర్గ నోడల్ అధికారి కోలా రాజేష్ కుమార్ గౌడ్ ఎన్నికలపై అవగాహన కల్పించారు. టీఎల్ ఎఫ్, ఆర్.పి.లు, ఓ.బి.లు ఎన్నికల నియమావళి, ప్రక్రియపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షేత్ర స్థాయిలో స్వయం సహాయక బృందాలకు ఆర్.పి.లు, ఓ.బి.లు ఓటు హక్కు ప్రాధాన్యంపై చైతన్యం కలిగించి ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం అందరిచేతా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఓ నాగరాజు, టీఎల్ ఎఫ్ లు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పరకాల శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం గీసుగొండ మండలం దస్రు తండా, నందనాయక్ తండా గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులూ గులాబీ గూటికి చేరారు. వారికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి కావాలంటే కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్నాయన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాని తెలిపారు. మతం, కులం పేరుతో ఓట్లు అడుగుతున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. 24గంటలు కరంట్ ఇస్తున్న కేసీఆర్‌ను బీఆర్ఎస్ ఆశీర్వదించాలన్నారు. పార్టీకోసం పని చేసే ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తిపు ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో బాదావత్ గణేష్(వార్డ్ మెంబెర్,కాంగ్రెస్), బాదావత్ బాలు (మాజీ వార్డ్ మెంబెర్), బానోత్ వెంకన్న, బాదావత్ గణేష్, భూక్య బాలు, హాలావత్ రాజు, హాలావత్ వీరన్న, హాలావత్ రమేష్, నరేందర్, సునీల్, విజయ్, హేమంత్, పూర్ణాచందర్, అఖిల్, గణేష్, వెంకన్న, రమేష్, సంతోష్, రాజు, ఓంకార్, నర్సింహా, రాజు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మోతీ లాల్, సోషల్ మీడియా కోర్డినేటర్ లెనిన్ గౌడ్, జాగృతి జిల్లా అధ్యక్షుడు యర బాలకృష్ణ, జున్న రాజు యాదవ్, మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, దళిత బంధు కన్వీనర్ కోట ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీకి గన్నోజు రాజీనామా



**వరంగల్ వాయిస్, పరకాల :** టీడీపీ పరకాల నియోజకవర్గం ఇంచార్జి గన్నోజు శ్రీనివాస్ చారి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. సోమవారం పరకాలలోని సాయిరాం గార్డెన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన పరకాల నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు రాజీనామా చేస్తున్నామని ప్రకటించారు. 2014 నుంచి టిడిపిని పట్టుకుని ప్రచారం చేసిన గన్నోజు నేడు రాజీనామా చేయడం బాధాకరమన్నారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ తెలంగాణ ఎన్నికలలో పోటీలో నిలపడడం లేదని దానిపై రాజీనామా చేసినట్లు తెలిపారు. గన్నోజు రాజీనామా టీడీపీకి ఎదురుదెబ్బ అని పలువురు చర్చించుకుంటున్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో పరకాల పోలీసులు పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పరకాల ఏసీపీ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పరకాలలో జీఎంఆర్ గార్డెన్ లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ పాల్గొని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువకులు ఎక్కువమంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఏసీపీ వినోద్ కుమార్, పరకాల వెంకటరత్నం, ఆత్మకూర్, శాయంపేట సీఐ, సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్లు, బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుపై పార్టీలు స్పష్టతనివ్వాలి

## కార్మిక సంఘాల నేతల డిమాండ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లాలో ఉక్కు, బైరటిస్, సున్నం పరిశ్రమల ఏర్పాటు గురించి రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో స్పష్టతనివ్వాలని కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం పెరుమాండ్ల జగన్నాథం భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "అసెంబ్లీ ఎన్నికలు– కార్మికుల మ్యానిఫెస్టో" అంశంపై సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి డిమాండ్లతో పాటు జిల్లా పరిధిలోని అనేక అంశాల మీద చర్చించి వర్కర్స్ మేనిఫెస్టో రూపొందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్ టీయూ జిల్లా కార్యదర్శులు కుంట ఉపేందర్, రేషపల్లి నవీన్, హెచ్ లింగన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే ఒక్క పరిశ్రమ కూడా లేని జిల్లా మహబూబాబాద్ జిల్లానే అని అన్నారు. జిల్లాలో అనేక పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, గార్లలో బైరటిస్ పరిశ్రమ, గంగారంలో సున్నం పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా అనేక ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. జిల్లాకు కార్మిక శాఖ అధికారిని నియమించాలని, కేసముద్రంలో ఏఎల్ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, క్వారీ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, మిర్చి తొడిమెలు తీసే వారిని కార్మికులకు గుర్తించాలని, హమాలి ట్రాన్స్ ఫోర్ట్, స్ట్రీట్ వెండర్స్, మిర్చి తొడిమెలు తీసేటువంటి అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ, ఐకేపీ వీవోఏ, మధ్యాహ్న భోజన కార్మికులకు సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 30శాతానికి పైగా ఉన్న కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలతో రూపొందించిన వర్కర్స్ మ్యానిఫెస్టోను పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులకు, రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులకు అందజేస్తామని వెల్లడించారు. ఈ రౌండ్ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్ టీయూ సంఘాల జిల్లా నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీను, వాసం దుర్గారావు, నర్రా శ్రావణ్, దేవేందర్, బాబు, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

## నేతలతో దుద్దిళ్ల శీనుబాబు ముచ్చట్లు



**వరంగల్ వాయిస్, కాటారం :** శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో కాటారం, మహాదేవపూర్ మండల కేంద్రాలలో యువజన కాంగ్రెస్ నేతలతో మంథని శాసనసభ్యుడు దుద్దిల్ల శ్రీధర్ బాబు సహోదరుడు, శ్రీపాదరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శీనుబాబు మాట ముచ్చట నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున కాటారం మండలం ధన్వాడలో గ్రామస్తులతో రోడ్డుపైననే ముచ్చటించారు. అనంతరం మాహదేవపూర్ మండలంలోని బొమ్మపూర్ క్రాస్ వద్ద శ్రీనుబాబు యూత్ కాంగ్రెస్ నేతలతో ముచ్చటించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై ఆయన యూత్ కాంగ్రెస్ నేతలతో సమీక్షించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నెరవేర్చనున్న ఆరు గ్యారెంటీ పథకాల కార్డులను ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గెలుపునకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. అంతకుముందు ఆయన ధన్వాడ స్వగ్రామంలో బస్టాండ్ వద్ద కల్వర్టుపై కూర్చుని గ్రామస్తులతో ఎన్నికల గురించి చర్చించారు. మహాదేవపూర్ లో యూత్ కాంగ్రెస్ నాయకులు మేసినేని రవిచంద్ర, తన్నీరు రాఘవేంద్ర, దహగం సంతోష్, కడార్ల నాగరాజు, నెన్నేల గట్టయ్య , పెండ్యాల సునీల్, కలీం, కృష్ణమోహన్, భాస్కర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

## జోరందుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రచారం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మహబూబాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ మురళి నాయక్ బీఫామ్ అందుకున్న తర్వాత మొట్టమొదటిసారిగా నెల్లికుదురు మండలం కేంద్రంలో సోమవారం ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలనను అంతమొందించి ప్రజలకు పాలనను అందుబాటులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో గతంలో అధికారంలో ఉన్న బానోత్ శంకర్ నాయక్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం రాకమందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పేర్లు మార్చి, గొప్పలు చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆరు గ్యారెంటీ స్కీములను కచ్చితంగా అమలు పరుస్తామని, ప్రజలకు వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లికుదురు మండలం కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న వలసలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గంలోని పలు మండలాలు గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. వారికి గులాబీ కండువాలు కప్పి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వెల్పుకొండ లింగయ్య, డొంక యాకయ్య, తొర్రూరు మాజీ ఎంపీపీ గంపల శంకరయ్య అధ్వర్యంలో మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. తొర్రూరు కు చెందిన ఆటో యూనియన్ నాయకులు మంగళపల్లి యాకయ్య, కుంటకొమ్ము నాగరాజు, ఖమ్మం పాటీ దినేష్, బానొత్ శ్రీను, గొల్లపల్లి నరేష్, బంధు వెంకటేష్, మంగళపల్లి సాగర్, ప్రభు, దయాకర్, శ్రీకాంత్, నల్లగురి రాంమూర్తి, సాయి, బిన్నీ, ఉపేందర్, మధు, అశోక్, సుధాకర్, గణేష్ తదితరులు, చింతలపల్లి గ్రామం నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు, ఈదుల కుంట తండా, భోజ్యా తండా లకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎన్ రాములు, రామ్ చరణ్, బిక్షం, సంతోష్, యాకూబ్, నవీన్, సందీప్, సురేష్, సుధాకర్, రామ చంద్రు, బుజ్జి, విజయ్, లింగా, బిక్షం నరేష్, రమేష్, నాగేష్, బి.రమేష్, సూర్య, తేజ, వెంకన్న, దిలీప్, పన్య, వంశిలలిత, నెహ్రూ, రవి, ఆగా, రావుజ, రాజు తదితరులు, దేవరుప్పుల కు చెందిన కాంగ్రెస్ నాయకులు చింత భిక్షపతి, చింత మల్లయ్య, జోగు సంతోష్, జోగు ఎల్లయ్య, ఇంద్రమ్మ, గడ్డం స్వామి, జలగం యాదగిరి, బాకి ఉప్పలయ్య, ఉప్పల కొండయ్య, మల్లమ్మ, చింత పుల్లయ్య, జోగు యాదగిరి, సాయి ప్రకాశ్, ఎసొబ్, పాపిల్ల డానియల్ తదితరులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# దళిత బంధు పేరుతో దళితులను మోసం చేసిన కేసీఆర్

## కాంగ్రెస్ పార్టీ పరకాల అభ్యర్థి రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన పలు కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీ నాయకుల మోసపూరిత వాగ్దానాలకు, దళిత బంధు ఇస్తామనే మాటలకు మోసపోయి కాంగ్రెస్ పార్టీలోనే న్యాయం జరుగుతుందని భావించి పరకాల నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ రేవూరి ప్రకాష్ రెడ్డి  కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా అహ్వానించారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ దళిత బంధు పథకంలో 30 శాతం కమిషన్లు తీసుకున్న దివాలకోరు ప్రభుత్వం దివాలకోరు నాయకులు బీఆర్ ఎస్ అన్నారు. దళిత బంధు పేరుతో మరో మారు దళితులకు మాయమాటలు చెప్పి కేసిఆర్ సర్కార్ మోసం చేస్తోందని వీటన్నింటిని గ్రహించి దళితులు మరోసారి మోసపోకుండా నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ చేతి గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే దళితులకు అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద రూ.12లక్షలతో దళిత బంధు ఎలాంటి షరతులు లేకుండా ఇస్తామన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 6లక్షలు ఇస్తామన్నారు. రైతు భరోసా పథకం కింద ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి 15000 ఇచ్చి వ్యవసాయ కూలీలకు 12000 ఇచ్చి ఆదుకుంటామన్నారు. అంతే కాకుండా వరి పంటపై 500 బోనస్ ఇస్తామని అన్నారు. పార్టీలో చేరిన వారు గంగోజుల రాజు, గజ్జి జైపాల్, అల్లే కుమారస్వామి, అల్లే కోటి, మహమ్మద్ అఫరోజ్, దయ్యాలా రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పులిగిల్ల గ్రామ కాంగ్రెస్ కమిటీ నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## మీ వైఖరి ప్రకటించకుండా విమర్శలేలా..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతీయ జనతా పార్టీ ప్రకటించిన బీసీ ముఖ్యమంత్రి పై కేటీఆర్ విమర్శలు చేయటం సమంజసం కాదని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునారి శేషు అభిప్రాయపడ్డారు. సుబేదారిలో బీసీ నాయకుడు దార బోయిన సతీష్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న డాక్టర్ శేషు మాట్లాడుతూ బీసీ ముఖ్యమంత్రిపై కేటీఆర్ పదవితో మారేదేమి లేదని మాట్లాడారు . మరి పదవితో మారేదేమి లేకపోతే కేసీఆర్ హామీ ఇచ్చిన మేరకు దళితుడిని ముఖ్యమంత్రి చేయాలని డిమాండ్ చేశారు. బీసీల అంతిమ లక్ష్యమైన రాజ్యాధికారంపై విమర్శలు చేయటం మీ అగ్రకుల ఆధిపత్య భావజాలాన్ని తెలియజేస్తుందని విమర్శించారు. అధికారం మీ చేతిలో ఉంది కాబట్టి బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడం లేదని, బడ్జెట్ లో మూడు శాతం నిధులు కూడా కేటాయించటం లేదని అభిప్రాయపడ్డారు. బీసీల అభివృద్ధి, సంక్షేమం, రాజ్యాధికారం, అధికారంలో వాటాపై మీ వైఖరి స్పష్టం చేయకుండా బీజేపీ బీసీలకు ఇచ్చిన హామీపై విమర్శలు చేయటం కులం కన్నా గుణం మిన్న అని చెప్పటం భావ్యం కాదన్నారు. శాసనసభ ఎన్నికలలో పోటీ చేయడానికి బీసీలకు కేవలం బీఆర్ఎస్ 22 టికెట్లు కేటాయించటంతో బీసీల గురించి మాట్లాడే అర్హత మీకు లేదన్నారు. బీజేపీ ఇచ్చిన బీసీ ముఖ్యమంత్రి హామీని శాసనసభ ఎన్నికలలో పోటీ చేయడానికి 40టిక్కెట్లు ఇస్తామనే హామీని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు చిన్నాల యశ్వంత్ యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై శ్వేతపత్రం విడదల చేయాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ప్రజలు ఆశీర్వదిస్తే చరిత్ర సృష్టిస్తా..ప్రజా భవిష్యత్ కోసం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని బీజేపీ డోర్నకల్ నియోజకవర్గ అభ్యర్థి భూక్య సంగీత నాయక్ అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో 'గడపగడపకు బీజేపీ' ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రిగా, ఎమ్మెల్యేగా 30ఏళ్లుగా రెడ్యానాయక్ కు ఇక్కడి  ప్రజలు అవకాశం ఇస్తే నియోజవర్గానికి ఏమీ చేయలేదన్నారు. పట్టణం మున్సిపల్ గా మారినందుకు తగ్గట్టుగా అభివృద్ధి జరగలేదన్నారు. దీనిపై మున్సిపల్ పాలకవర్గం శ్వేతపత్రం విడదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా, వైద్యంతో పాటు ప్రభుత్వ కార్యలయాలు, కూరగాయల మార్కెట్ లేక చూట్టు తండాలో తాగు నీరు, వైద్యం అందక గిరిజన ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. అనుచరులు తప్ప ప్రజలు అభివృద్ధి చెందలేదన్నారు. నిస్వార్ద రాజకీయాల కోసం బీజేపీ అభ్యర్థిగా తనను బలపరచి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాంచంద్ర రావు, ప్రవారీ దామోదర్ రెడ్డి, పెంటయ్య, మండలాధ్యక్షుడు బాసాని నాగేష్, పట్టణాధ్యక్షులు దేవ నాయక్, గణేష్, లాల్ సింగ్, రహ్మామన్, తోట, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## చల్లాను భారీ మెజారిటీతో గెలిపించాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు మేకమల్ల వెంకటేష్ అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం సోమవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల సమన్వయ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి(చందు), ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతి రెడ్డిలు మాట్లాడుతూ త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకు వివరించే విధంగా సమయాత్తం కావాలని అన్నారు. అనంతరం బూత్ కన్వీనర్, కో కన్వీనర్, మెంబర్స్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు కోడెపాక కరుణాకర్, మచ్చ రవీందర్, చందా కుమారస్వామి, నందికొండ జయపాల్ రెడ్డి, బీముడి నాగిరెడ్డి, గోల్కొండ సదానందం, పరకాల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్స్ పోచంపల్లి రఘుపతి, తిప్పర్తి ప్రశాంత్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు బొల్లారం అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సురాబు శ్రీకాంత్, నడికూడ మండల బీఆర్ఎస్వీ అధ్యక్షుడు దురిశెట్టి వెంకటేష్, బీఆర్ఎస్వీ సీనియర్ నాయకులు గుడికందుల శివ, ప్రజాప్రతినిధులు, గ్రామకమిటీ అధ్యక్ష,కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నన్ను గెలిపించండి.. మిమ్మల్ని గెలిపిస్తాను

### ఎమ్మెల్యే రెడ్యా నాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** నియోజకవర్గంలోని జరిగిన అభివృద్ధిని చూసి తనకు మరోమారు ఎమ్మెల్యే అవకాశం కల్పించాలని రెడ్యానాయక్ అన్నారు. నియోజవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తారురోడ్ల నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్లు, ప్రకృతి వనాలు పల్లె, పట్టణ ప్రగతి పనులు, ప్రభుత్వ స్కూల్స్, ఆసుపత్రుల ఆధునీకరణ, నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ ఏర్పాటు మార్కెట్ సముదాయ, కుల సంఘాల భవన నిర్మాణాలు లాంటివి జరిగాయన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేకు అత్యంత మెజార్టీ అందించి గెలిపించాలని కోరారు. ముఖ్యంగా కార్యకర్తలు సంఘటితంగా ముందుకు సాగుతూ ప్రజల ఆశీర్వాదం పోందాలని సూచించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నున్న రమణ, ఎంపీపీ బాలు నాయక్, మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్, సర్పంచ్ ఫోరం మండలాధ్యక్షుడు బోసు వెంకన్న, కో ఆప్షన్ సభ్యులు లాల్ మియా, తేజావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సంపంగి సురేష్‌కు బెస్ట్ ఇండియా యంగెస్ట్ సీఈఓ అవార్డు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఐటీతో పాటు బిజినెస్ రంగంలో ప్రతిభ కనపరచిన వ్యక్తులకు ప్రతి సంవత్సరం ఐటీ టీవి ఆధ్వర్యంలో నిర్వహించే ఇండియా యంగెస్ట్ సీఈఓ ప్రతిష్మాత్మక అవార్డును సంపంగి గ్రూప్ సీఈఓ సంపంగి సురేష్ అందుకున్నారు. డోర్నకల్ మండల ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సంపంగి సురేష్ హైదరాబాద్ లోని హైటెక్ సీటిలోని టీ-హబ్ లో జరిగిన సమవేశంలో ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అథితిగా పాల్గొనగా సినీ హీరో సుమన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నాడు. సంపంగి గ్రూప్ సీఈఓ సురేష్ సంపంగి ప్రపంచంలోనే 28ఏళ్ల అతి పిన్న వయస్సులో ఐటీతో పాటు వ్యాపార రంగంలో ప్రవేశించి తన కంపెనీలో 500కంటే ఎక్కువ మంది ఉద్యోగులను ఉపాధి అవకాశాలను అందించారన్నారు. సంపంగి గ్రూప్ రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హాస్పిటాలిటీ, బయో ఫార్మింగ్‌లో తెలంగాణలోనే ప్రముఖ కంపెనీ. ఇది భారతదేశం, సింగపూర్, మలేషియా  యూఏఈలలో శాఖలను కలిగి ఉన్న ఎంఎన్ సీ కంపెనీ. వాస్తవానికి, ఖర్జూర సాగులో సంపంగి బయో-ఫామ్స్ భారతదేశంలో అతిపెద్ద కంపెనీ. సంపంగి గ్రూప్ తెలంగాణ రాష్ట్రంలో 6కి పైగా శాఖలను కలిగి ఉందని సీఈఓ తెలిపారు. తనకు ఈ అవార్డు రావడం సంతోషంతో పాటు బాధ్యత కూడా మరింత పెరిగిందని సురేష్ తెలిపారు.

## సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి, సామాజిక తనిఖీ బృంద సభ్యులకు సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. రేపటి నుంచి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలలో సెప్టెంబర్ 1, 2021 నుంచి మార్చి 31 ,2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై తనిఖీకి రానున్నాయి. పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు రికార్డులను సకాలంలో అప్పగించి, సామాజిక తనిఖీ పారదర్శకంగా జరిగేలా సామాజిక తనిఖీ బృందాలకి సహకరించాలని ఎంపీడీవో చక్రాల సంతోష్ కుమార్ కోరారు. ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల్ కుమార్, ఎస్ఆర్పీ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నాగరాజు సోమవారం ప్రారంభించారు. చౌరస్తా సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం బీ ఆర్ఎస్ పార్టీ నుంచి పర్వతగిరి, అన్నారం, పెద్ద తండా, ఏబీ తండా, చింత నెక్కొండ, భట్టు తండా, మోత్య తండా, బురుగుమడ్ల గ్రామాల నుంచి భారీగా నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు భద్రయ్య, కల్లెడ పీఏసీఎస్ డైరెక్టర్ చిదురు కిష్టయ్య, చిదురు మల్లేశం, నాగుల వీరస్వామి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కర్ణాటక స్టేట్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ధర్మసేన, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ రావు, కుందూరు వెంకటరెడ్డి, జాటోత్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

## గీత కార్మికుడి పార్థివదేహానికి బొనగాని నివాళి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వృత్తిలో భాగంగా తాడిచెట్టు పై నుంచి జారీ కింద పడి మరణించిన చిర్ర వెంకటయ్య గౌడ్ గీత కార్మికుడి పార్థివదేహానికి తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. నా గీతన్నల బ్రతుకులకు భరోసా లేదని, వృత్తికి రక్షణ లేదని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. నా గీత కార్మికులకు సేఫ్టీ మొక్కులను అందించి, వారి ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇప్పడికైనా రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ సేఫ్టీ మోకులను అందించి గీతన్నల ప్రాణాలను కాపాడాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు, దహన (అంత్యక్రియలు) కార్యక్రమ నిమిత్తం రూ.50,000 చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమం లో వర్ధన్నపేట మార్కెట్ చైర్మన్ కమ్మగోని స్వామి రాయుడు గౌడ్, తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పూజారి రఘు గౌడ్, జై గౌడ్ ఉద్యమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మార్క రవి గౌడ్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సట్ల అనిల్ గౌడ్, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి యాదగిరి గౌడ్, బూర అశోక్ గౌడ్, బూర శ్యామ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషన్ అనుమతిస్తే ఏర్పాట్లు చేయిస్తా

### మేయర్ గుండు సుధారాణి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికల కమిషన్ అనుమతిస్తే మహానగరపాలక సంస్థ నుంచి గతంలో మాదిరిగా ఏర్పాట్లను చేయిస్తానని మేయర్ గుండు సుధారాణి అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా 11న శనివారం జరుగు నరకాసుర వధ ఉత్సవాలకు కార్పొరేషన్ ద్వారా ఏర్పాట్లు చేయాలని నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి వినతిపత్రం ఇచ్చారు. రు ప్రాచీన కాలంలో జరిగిన సంఘటనలను నేటి తరానికి అందించాలని, గత 19సంవత్సరాలు నుంచి నరకాసుర వధ ఉత్సవాలు చేపడుతున్నట్లు, అలాగే ఈ సంవత్సరం నరకాసుర వధ ఉత్సవాలు ఉర్సు గుట్ట వద్ద చేపడుతున్నామని, ఈ ఉత్సవాలకు కార్పొరేషన్ ద్వారా విద్యుత్ అలంకరణ, మైక్ సౌండ్ సిస్టం, బ్యారికేడ్, టెంటు, కుర్చీలు, పారిశుద్ధ్యం, మంచినీటి వసతులు, అగ్నిమాపక వాహనం ఏర్పాటు చేయాలని కమిటీ వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా నరకాసుర వధ ఉత్సవ కరపత్రాలను మేయర్ గుండు సుధారాణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కనుకుంట్ల రవి, అవునూరి రామ్మూర్తి, కోరే సాంబమూర్తి, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, వంగరి సురేష్, మిరియాల ఆదిత్య, అన్న కుమారస్వామి, దూడ కొమురెల్లి, మరుపల్ల శివ, తౌటం నరసింహ, కొమ్ము రాజు, మంద పవన్, కంది అఖిల్, సాయిలు ఉన్నారు.

## సీ-విజిల్ యాప్‌లో కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలి

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** సీ-విజిల్ యాప్ ద్వారా ప్రజలు తమ దృష్టికి వచ్చిన ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లను మభ్య పెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వాటిని లైవ్ ఫొటోలు, లైవ్ వీడియోలను సీ-విజిల్ యాప్ ద్వారా తీసి పంపాలని తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వంద నిమిషాలలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని, లైవ్ ఫొటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్ లో ఉంచాలని, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా లోకేషన్ నమోదు అవుతుందని, సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత కామెంట్స్ చేసిన, పార్టీ అభ్యర్థులు పంచే డబ్బులు, మద్యం, బహుమతులు లాంటి వివరాలను, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించిన, ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై లైవ్ ఫోటోలు, వీడియోలు సి-విజిల్ యాప్ ద్వారా పంపాలని సూచించారు. ప్రజలు సి-విజిల్ యాప్ ను తమ ఫోన్ లలో ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకొని తమ చుట్టుపక్కల జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అప్లోడ్ చేసి తమ దృష్టికి తీసుకుని రావాలని, 24గంటలు కలెక్టరేట్ కార్యాలయంలో సి-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని, ఫిర్యాదు చేసిన వారి పేర్లను, సెల్ నెంబర్ లను గోప్యంగా ఉంచనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా ఆ ప్రకటనలో తెలిపారు.

# బీజేపీతోనే పెరిగిన బీసీల ఆత్మగౌరవం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, బీజేపీ నాయకులు డాక్టర్ కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ నుంచి ఎవరు పోటీ చేసిన మేమందరం ఏకతాటిపై ఉండి గెలిపించుకుంటామని అన్నారు. బీసీలకు ప్రాముఖ్యత కల్పించిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దాని గుర్తు చేశారు. రాష్ట్రపతిగా మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల చెందిన వారిని నియమించిన ఘనత ఒక బీజేపీకే ఉందని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పై ప్రజలందరూ అసహనం వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్రంలో బీజేపీ పుంజుకోవడంతో అసహనుని గురై కేటీఆర్ అవాకులు చేవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ బీసీలకు గుణం లేదని మాట్లాడిన కేటీఆర్ బహిరంగంగా తెలంగాణ బీసీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డాక్టర్ కాళి ప్రసాద్ రావు మాట్లాడుతూ 2014లో గెలిచిన కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి చేస్తానని దళితులను మోసం చేసిన విషయం ఎవరు మర్చిపోలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు అని సంక్షేమ పథకాల పేరు చెప్పి ఎవరికైనా పథకాలు అందించారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు తప్ప సామాన్య ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎటువంటి న్యాయం చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలందరికీ సమన్యాయం చేస్తుందన్నారు. బీసీలకు ప్రాముఖ్యత ఇస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని చూస్తే తట్టుకోలేక బీఆర్ఎస్ ప్రభుత్వం విమర్శలు చేస్తుందని గుర్తు చేశారు. కేటీఆర్ బీసీలకు గుణం లేదని అనడం హాస్యాస్పదమని, బీసీల మంచి గుణంతోనే రెండుసార్లు బిఆర్ఎస్ ప్రభుత్వం గెలిచిన విషయం మర్చిపోవద్దని హెచ్చరించారు. కేంద్రంలో గెలిచిన బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో సునాయాసంగా గెలుస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురు ప్రసాద్, రాష్ట్ర నాయకుడు దేవునూరి మేఘనాథ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మేకల రాజ వీరు, జిల్లా కార్యదర్శి ఎర్రం రామన్న, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బాసాని సోమరాజు, పరకాల మాజీ మున్సిపల్ చైర్మన్ మార్త రాజ భద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, కొలనుపాక భద్రయ్య, ఉపాధ్యక్షుడు నాగలి రంజిత్, సంఘ పురుషోత్తం, పిట్ట వీరస్వామి, పట్టణ కోశాధికారి మంతెన సంతోష్, మాజీ వార్డు మెంబర్ దారుణ నారాయణదాసు, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఆకుల రాంబాబు, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు గోనెల నరసింహ, ఎస్టీ పట్టణ అధ్యక్షుడు పాలకుర్తి ప్రతాప్, బూత్ అధ్యక్షుడు భలబద్ర రాజు, గాజుల రంజిత్ యాదవ్, తడక విక్రం గౌడ్, మారాటి నర్సింగ్, మంద రామేశ్వర్, బుచ్చు వరప్రసాద్, ఒంటేరు వీరేష్, జనగాం రాజు, గునుగంటి రఘుపతి, కొయ్యడ ప్రతాప్ పాల్గొన్నారు.

# సమస్యలు పట్టించుకోని పాలకులకు చరమగీతం పాడాలి

### బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు




వరంగల్ వాయిస్, వరంగల్ : రాష్ట్ర శాసనసభకు జరగనున్న ఎన్నికలలో ప్రజా సమస్యలు పరిష్కరించని పాలకులకు చరమగీతం పాడాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్ లోని తమ్మెర భవన్ లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తల సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు సిలువేరు విజయ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా పాలకులు ప్రజలను వంచించారన్నారు. సాగు భూములు, ఇండ్ల స్థలాలు పంపిణీ, పక్కా గృహాల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. వ్యవసాయ కార్మికులు దారిద్రరేఖకు దిగువన ఉండి తినడానికి సరైన తిండి, ఉండడానికి సరైన ఇల్లు, విద్యా, వైద్యం, కనీస అవసరాలకు నోచుకోలేదన్నారు. సాంఘిక అసమానతలు పెరిగాయని, కుల వివక్షత అనేక ప్రాంతాలలో కొనసాగుతున్నదన్నారు. దుర్భరంగా జీవిస్తున్న వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం ఉపాధి కోసం అభివృద్ధి కోసం కూలీ బంధు పథకం ప్రవేశపెట్టాలని, వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలలో వ్యవసాయ కార్మికుల డిమాండ్లను చేర్చాలన్నారు. నేడు ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిందని, నోట్లతో ఓట్లను కొనుగోలు చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. ప్రజలు చైతన్యంతో ఆలోచించి ఓటుహక్కును సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని కోరారు. చింతల సారయ్య, కొమ్ముల అనిల్, బొల్లంమల్లయ్య, సౌందర్య, రవి పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత మాటలు నమ్మొద్దు

### ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రజల చేతిలో కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం తప్పదని పరకాల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామానికి చెందిన యువత పరకాల శాసన సభ్యుడు చల్లా ధర్మారెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేయాలన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో నంబర్ వన్ నిలిచిందన్నారు. అందుకు కేసీఆర్ కృషి ఎంతో ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను సరైన రీతిలో సామాజిక మాధ్యమాల్లో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. పదేండ్ల క్రితం తెలంగాణ ఎట్లా ఉండే,ఇప్పుడు ఎట్లా ఉన్నదో యువత గమనించాలన్నారు. బీజేపీ మతరాజకీయాలను, కాంగ్రెస్ మోసపూరిత రాజకీయాలను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాయంపేటలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట, పత్తిపాక, పెద్దకోడేపాక గ్రామాలల్లో శాయంపేట పోలీసు వారు బార్డర్ సెక్యూరిటీ పోలీసు(ఆర్మీ )లతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పరకాల ఏసీపీ కిషోర్ కుమార్ ఆదేశాల మేరకు జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తూ పరకాల రూరల్ సీఐ డి.మల్లేష్ , శాయంపేట ఎస్సై డి దేవేందర్ ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. 100మంది పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఆశాజ్యోతి జీఎంఆర్ ట్రస్ట్



## 'గుప్పెడు సంకల్పం' పేరుతో ఉచిత సేవా కార్యక్రమాలు

### బీఆర్ఎస్ యువనేత, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గండ్ర గౌతంరెడ్డి పర్యవేక్షణలో నిరుపేదలకు బాసట

- గడ్డం కేశవమూర్తి



**సామాజికసేవే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్యల ఉంటూ వారికి అండగా నిలుస్తోంది జీఎంఆర్ ట్రస్టు. భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి సంయుక్త ఆధ్వర్యంలో దివంగత గండ్ర మోహన్ రెడ్డి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎంతగానో సేవలందిస్తున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని అన్ని వర్గాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు 'గండ్ర' దంపతులు అండగా నిలుస్తున్నారు. బీఆర్ఎస్ యువనేత, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గండ్ర గౌతంరెడ్డి పర్యవేక్షణలో జీఎంఆర్ ట్రస్ట్ నిరుపేదలకు బాసటగా నిలుస్తున్నది. ముఖ్యంగా భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్నది. ఎండనక.. వాననక.. పల్లెల్లో సేవలందిస్తూ ఈ స్వచ్ఛంద సంస్థ తమ సేవా భావాన్ని చాటుకుంటున్నది. సేవాతత్పరుడు గౌతంరెడ్డి వారి తల్లిదండ్రుల అడుగుజాడల్లో పయనిస్తూ తన కలను నిజం చేసుకుంటున్నారు.**

### గుప్పెడు సంకల్పం...

రాజకీయ కుటుంబంలో గండ్ర గౌతంరెడ్డి జన్మించారు. తాత దివంగత గండ్ర మోహన్రెడ్డితోపాటు, తల్లిదండ్రులు గండ్ర జ్యోతి (వరంగల్ జడ్పీ చైర్పర్సన్), గండ్ర వెంకటరమణారెడ్డి (ఎమ్మెల్యే) వారి ప్రజాసేవను చూసి ఆయన కూడా అదే బాటను ఎంచుకున్నారు. సమాజంలో మార్పు రావాలంటే.. మొదటి అడుగు మనమే వేయాలి. దీనిని నమ్మిన గౌతంరెడ్డి.. తాత గండ్ర మోహన్రెడ్డి పేరిట జీఎంఆర్ ట్రస్టు ఏర్పాటు చేశారు. 'గుప్పెడు సంకల్పం'తో దీని ద్వారా అనేక ఉచిత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవ చేయాలన్న సంకల్పం ఉన్నంత మాత్రాన సరిపోదు! తగిన శక్తి, సామర్థ్యాలు ప్రోది చేసుకోవాలి. అప్పుడే సమాజంలో అవకాశాలు తలుపులు తెరుచుకుంటాయంటారు గండ్ర గౌతంరెడ్డి. ఎప్పుడు మన కోసం మనమే కాకుండా.. చుట్టూ ఉన్న దాని గురించి కూడా ఆలోచించాలి. దీన్ని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా భావించాలంటారు గండ్ర గౌతంరెడ్డి.




### సేవకు 'సై' అంటుంది జీఎంఆర్ ట్రస్ట్...

చిన్నప్పుడు సినిమాలు చూసి యాక్టర్ అయితే బాగుండు అనుకుంటారు. విమానం చూడగానే పైలట్ అవ్వాలనుకుంటారు. కానీ, పెద్దయ్యే కొద్దీ ప్రాధాన్యాలు మారిపోతాయి. దీనిని గమనించిన గండ్ర గౌతంరెడ్డి ప్రజాప్రతినిధులైన తల్లిదండ్రుల బాటలో పయనిస్తూ తాత స్వర్గీయ మోహన్ రెడ్డి పేరును సార్థకం చేస్తున్నారు.

గండ్ర గౌతంరెడ్డి.. నిన్నటి తరం పెద్దలందరికీ గండ్ర వెంకటరమణారెడ్డి గారి తనయుడు ! నేటి తరం వాళ్లకి గౌతం అంకుల్. రాజకీయరంగంతో ' దగ్గర సంబంధాలు ఉన్నా.. ఆయన చాలా సింపుల్గా ఉంటారు. ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తూ ఆకట్టుకుంటారు. అమ్మ, నాన్నల ప్రేమ, మమకారం.. తాతయ్య వాత్సల్యం.. నానమ్మ వారసత్వం.. గౌతంరెడ్డి ఎదగటానికి దోహదపడ్డాయి. సమాజ శ్రేయస్సు కోసం పరితపిస్తున్న ఆయన సేవే పరమావధిగా ముందుకెళ్తున్నారు.

కరోనా కరాళ నృత్యం చేసిన సందర్భంలో... వైరస్ బాధితులకు జీఎంఆర్ ట్రస్ట్ ద్వారా సేవలందించారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఆయన ఎదురు చూడలేదు. అంతా ప్రభుత్వ బాధ్యతేనని కూర్చోలేదు. కరోనా విజృంభించిన సమయంలో వందలాది కుటుంబాల ఆకలిని ఈ ట్రస్ట్ ద్వారా తీర్చారు.

నిత్యం ఎన్నో సమస్యలు కళ్ల ముందు కనిపిస్తాయి. అవన్నీ.. పరిష్కరించలేనంత పెద్దవేమీ కావు. కానీ మనకెందుకులే.. అనే నిర్లిప్తత! కానీ, ఆయన అలా అనుకోలేదు. జీఎంఆర్ ట్రస్ట్ ద్వారా గౌతంరెడ్డి వాటికి అడ్డుకట్ట వేయాలనుకున్నారు. సేవా ప్రపంచంలో అడుగుపెట్టి.. కనిపించిన ప్రతి సమస్యకు తనదైన పరిష్కారాన్ని చూపుతున్నారు. యువకులు చెడు దారి పట్టకుండా వాళ్లని పారా మిలటరీ పోటీ పరీక్షలకు సిద్ధం చేశారు. ఎస్సై, కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ కోసం కొందరికి శిక్షణ ఇప్పించారు. ముఖ్యంగా భూపాలపల్లి అటవీ ప్రాంత యువతలో జీఎంఆర్ ట్రస్ట్ స్ఫూర్తి నింపుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థులకు 55 రోజులపాటు టెట్ (టీచర్స్ ఎలిజబులిటి టెస్ట్ లో ఉచిత శిక్షణ ఇప్పించారు. అభ్యర్థులకు అన్ని వసతులతోపాటు పౌష్టికాహారాన్ని అందజేశారు. శిక్షణ పొందిన వారిలో 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బొచ్చు నితిన్ జార?ండ్ రాష్ట్రంలోని ధన్బాద్ లో ఇంజినీరింగ్ మైనింగ్ మెషినరీ (ఐఎస్ఎం) లో విద్యనభ్యసిస్తున్న క్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి ఆ విద్యార్థికి ట్రస్ట్ ద్వారా లాప్టాప్ని బహుకరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు వెయ్యి మంది నిరుద్యోగ యువతీ, యువకులకు గ్రూప్స్ ఉచితంగా శిక్షణ అందించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు వందలాది మందికి ఉచితంగా డ్రైవింగ్ లో శిక్షణ ఇప్పించారు. భూపాలపల్లి, రేగొండ మండలాల్లోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఉచితంగా డ్రైవింగ్ శిక్షణతోపాటు లైసెన్స్ లను అందించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ మున్సిపల్ గ్రౌండ్ లో 'ఎమ్మెల్యే కప్' క్రికెట్ టోర్నమెంట్ ను విజయవంతంగా నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. యువకుల్లో మరింత ఉత్సాహాన్ని పెంపొందించేలా ఆటల పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో కోలాట బృందాల మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో ప్రతి రోజు రోగులకు, వారి సహాయకులకు మధ్యాహ్న భోజనం అందిస్తూ అన్నదాతగా నిలిచారు.








































## అడవి బిడ్డలకు ఆసరా!

పని ఎంత చిన్నదైనా, దాన్ని పెద్ద బాధ్యతగా చేసేవారు కొందరే ఉంటారు. ఆలోచన బలంగా ఉండాలే గాని లక్ష్యసాధన దిశగా సాగే ప్రయాణంలో ఎన్ని కష్టాలు వచ్చినా, వాటిని ఇష్టంగా స్వీకరిస్తూనే విజయం సాధించొచ్చని గండ్ర గౌతంరెడ్డి నిరూపించారు. ఏజెన్సీ ప్రాంతమైన భూపాలపల్లి నియోజకవర్గంలోని అడవి బిడ్డలకు విజ్ఞాన పాటలు, ఆరోగ్య సూత్రాలు బోధించడంతోపాటు వారికి అన్ని రంగాల్లో శిక్షణ ఇప్పిస్తూ విజయాల బాట పట్టించారు.









ఒక ఇంట్లో ఒక ప్రజా ప్రతినిధి ఉండడమే గొప్ప.. అలాంటిది ఇద్దరూ ఉంటే విశేషమే కదా! మరి ఆ రాజకీయ రంగంలో ఎదిగితే ముమ్మాటికి అద్భుతమే. సమకాలిన రాజకీయాల్లో అలాంటి అద్భుతాలు ‘గండ్ర’ దంపతులు ఎన్నో సృష్టించారు. గండ్రజ్యోతి వరంగల్ జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్‌గా, గండ్ర వెంకట రమణారెడ్డి భూపాలపల్లి ఎమ్మెల్యేగా ప్రజాసేవలో ముందుకెళ్తు అందరి దృష్టిని ఆకర్షించారు. రాజకీయరంగంలో వీరు అన్ని విధాలుగా రాణిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు.





# నేను మీ మనిషిని

## మన మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారు
## ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేను మీ ఇంటి మనిషిని..మీ సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా అని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. అయితే మన మధ్య చిచ్చుపెట్టాలని కొందరు చూస్తున్నారంటూ హెచ్చరించారు. వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సోమవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 21,22,23,13వ డివిజన్ లోని యువత పెద్ద ఎత్తున తరలివచ్చి పోచంమైదాన్ సెంటర్ లో ఎమ్మెల్యే నన్నపునేనికి డీజే మోతలతో, భారీ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం దేశాయిపేటలోని కేఆర్ గార్డెన్ లో యూత్ నాయకులు దిలీప్ రెడ్డి ఏర్పాటు చేసిన చేరిక కార్యక్రమానికి హాజరై కాంగ్రెస్ బీజేపీ నుంచి యూత్ నాయకులు ఆఫ్రోజ్, కమల్, అగ్బర్ తో పాటు సుమారు 150 మంది నేడు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖిలా వరంగల్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో పడమర కోటలో విశ్వకర్మ సంఘం కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై రానున్న ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని బలపరుస్తూ హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, డివిజన్ ముఖ్య నాయకులు, విశ్వకర్మ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీకి దక్కిన అరుదైన గౌరవం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన సృష్టి ఆర్ట్స్ అకాడమీ, కళా యజ్ఞ సంయుక్తంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్ – 2023 తెలుగు రాష్ట్రాల్లో చిత్ర కళకు సేవచేస్తూ, కళల్ని విస్తరింప చేస్తున్న పలు ఆర్ట్స్ అకాడమీలను గుర్తించి ఆయా సంస్థలను గౌరవించి సత్కరించారు. హనుమకొండకు చెందిన సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీకి కూడా ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ పురస్కారం అందుకున్న డైరెక్టర్ సాగంటి మంజుల తన అకాడమీకి దక్కిన ఈ గౌరవం తనకేంతో తృప్తిని ఇచ్చిందన్నారు. ఇంకెంతో మందికి శిక్షణ ఇస్తానని, అలాగే అనుబంధ సంస్థ ఐన సాగంటీస్ హెల్పింగ్ సొసైటీ ద్వారా పేద పిల్లలకు ఉచిత శిక్షణ, పుస్తకాల పంపిణీ చేశామన్నారు. వంద కుటుంబాల వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ ఇలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నిర్వాహకులు, శేష బ్రహ్మంకు కృత్ఞతలు తెలిపారు.

## హుస్నాబాద్‌లో పొన్నం గెలుపు ఖాయం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** హుస్నాబాద్ నియోజకవర్గంలో పొన్నం ప్రభాకర్ గెలుపు ఖాయమని యువజన నాయకులు గజ్జెల సురేష్ అన్నారు. మండలంలోని ముల్కనూర్ గ్రామంలో శ్రీ గార్డెన్స్ లో ఆదివారం జరిగిన బూత్ లెవెల్ సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని, పొన్నం ప్రభాకర్ ను అధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు మనందరం కృషి చేయాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు పొన్నం ప్రభాకర్ ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం సంతోషకరమని, పొన్నం ప్రభాకర్ గెలుపు ఎవరు ఆపలేరని గజ్జెల సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్ల రాహుల్, తాళ్లపల్లి పవన్, రొడ్డ అజయ్, మెరుగు శ్రీకాంత్, తాళ్లపల్లి ప్రతాప్, వంశీ సురేందర్, రాకేష్ పాల్గొన్నారు.

# తెలంగాణ భవితకు కేసీఆర్ భరోసా

## బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని చీఫ్ విప్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఎన్నికల వేళ అభివృద్ధిని సైతం అవహేళన చేస్తూ ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్న ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. బీజేపీ , కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు ఏం అభివృద్ధి చేశాయో ప్రజలకు చెప్పలేని స్థితిలో ఇక్కడి నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని చెప్పుకొచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వాడల్లో తిరగకుండా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే బీఆర్ఎస్ పార్టీ తోనే అది సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనను బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మళ్లీ భారీ మెజారిటీతో గులాబీ జెండాను ఎగురవేయబోతున్నామని స్పష్టం చేశారు. అవగాహనతో ఆలోచించి నిర్ణయం తీసుకుని ఓటు వేయండని, బీజేపీ, కాంగ్రెస్ వాళ్ళ మాయ మాటలు నమ్మి మోసపోకండని హితవు పలికారు. నవంబర్ 30న జరగనున్న ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు రుణ విముక్తి కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్ధన్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ గుంటి రజిత శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సిరబోయిన కరుణాకర్, డివిజన్ ఇంచార్జి మేకల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు కేశబోయిన మోహన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి కేశోజు వినయ్ కుమార్, మాజీ అధ్యక్షులు, సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యోగా పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా రవీందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి యోగా పోటీల టెక్నికల్ అఫిషయల్ గా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం గుంటూరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పాకాల రవీందర్ ను నియమించడం జరిగింది. ఈ మేరకు ఎస్.జీ.ఎఫ్ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఎస్.జీ.ఎఫ్ స్టేట్ సెక్రటరీ కె.రాంరెడ్డి శనివారం ఉత్తర్వులను వెల్లడించారు. కాగా ఈ నెల 30 నుంచి నవంబర్ 1వరకు మూడు రోజులపాటు సిద్దిపేట జిల్లాలో జరుగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు టెక్నికల్ అఫిషయల్ గా వ్యవహరించాల్సి ఉంది. ఈ నేపథ్యం లో గుంటూరుపల్లి పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కే చంద్రశేఖర ఆర్య, బొలిశెట్టి కమలాకర్, కుందే కిరణ్, కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నరసింహా రాములు, రవీందర్ కు పలువురు అభినందనలు తెలిపారు.

## సగర కులస్తుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సగర(ఉప్పర) హక్కుల సమితి కన్వీనర్ జూకంటి రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి , బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ను కలసి వారి పార్టీ మేనిఫెస్టో లో సగర (ఉప్పర) కులస్తుల సమస్యలను చేర్చాలని వినతి పత్రం అందజేశారు. వారు సానుకూలంగా స్పందిస్తూ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి సగరులు సమస్యలని పరిష్కరిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో నలుబోలా అమరేందర్, వరంగల్ జిల్లా సగర ఉపాధ్యక్షులు నలుబల రవి, సంజయ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేటకు చెందిన బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామితో సహా 300మంది వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గుంటి కుమారస్వామి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో నాయిని రాజేందర్ రెడ్డిని గెలిపించుకుని కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన యువకులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని అగ్రంపాడు గ్రామంలోని 15మంది యువకులు బీజేపీలో చేరారు. మాదాసి మహేందర్ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం అధ్యక్షతన సోమవారం ఆత్మకూర్ మండల కేంద్రంలో వారికి బీజేపీ నేత డాక్టర్ పగడాల డాక్టర్ కాళీ ప్రసాద్ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళీ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించడం పట్ల యువకులు పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు మాదాసి శ్రీకర్, మాదాసి రాకేష్, మాదాసి వెంకటేష్, మాదాసి రవీందర్, మడిపల్లి బాబు, మడిపల్లి కుమార్, మడిపల్లి అజయ్, పవన్, మాదాసి సురేష్, మాదాసి మైపాల్, ఒగోనిపల్లె నుంచి మద్దూరి మధుకర్ నాయకత్వంలో 15మంది యువకులు చేరారు. నాయకులు డాక్టర్ కాళీ ప్రసాద్ వారికి బీజేపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మద్దూరి శ్రవణ్, వెంకటేష్, పవన్, తిరుమలేష్, వెంకటేష్, ఓం ప్రకాష్, ప్రణీత్, రేవంత్, రంజిత్, ఆవుల సన్నీ, ఉత్తరేణి రాజకుమార్, సాయిరాంలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మండల ఇంచార్జి కాచం గురు ప్రసాద్, దేవునూరి మేఘనాథ్, కౌన్సిలర్ కోలనుపాలక భద్రయ్య, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్, మార్త భిక్షపతి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ బలభద్ర దినేష్, వంగాల బుచ్చిరెడ్డి, రంజిత్, మండల కార్యదర్శి భయ్యా పైడి, ఆచార్య పున్నం, అశోక్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com